# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 30 జనవరి 2025 RANGAREDDY




↑ విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## కాంగ్రెస్‌ను ప్రజలు ఛీదరించుకుంటుండ్రు..

**విత్తన సమయంలో రైతు భరోసా అందిస్తే.. రైతుకు ఉపయోగం..**

**ఇప్పుడు అందించడంలో ఆంతర్యమేమిటి ?**

**పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదు..**

**స్థానిక సంస్థల ఎన్నికలకు ఎందుకు జాప్యం**

**పొంతన లేని సీఎం, మంత్రుల మాటలు**

**సీఎం సొంత నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించాలి**

**అధిక పెట్టుబడులతో మండలానికో పరిశ్రమ ఏర్పాటు చేయాలి**

**మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**

కొడంగల్, జనవరి 29 : ఏడాదిలోనే కాంగ్రెస్ పాలన ఎలా ఉన్నదో ప్రజలకు అర్థమైందని, చెప్పేది ఒకటి, చేసేది మరొకటిగా ఉండడంతో ప్రజలు ఛీదరించుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం లగచెర్ల కేసు నిమిత్తం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ విత్తనాలు విత్తే సమయంలో రైతు భరోసా ఇస్తే రైతులకు ఉపయోగకరంగా ఉండేదని, ఇప్పుడు అందించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పథకాలను ప్రారంభించారని ఆరోపించారు. ఎన్నికలప్పుడు ప్రతి రైతుకూ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన మాట నీటిమూటలా మారిందని, పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా చేతులు దులుపుకున్నదన్నారు. అదునుకు పెట్టుబడి సాయం అందజేయకుండా మార్చి 31వ వరకు అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఆరు గ్యారెంటీలంటూ హామీలిచ్చి ఏడాది దాటినా అతీగతి లేదన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో వేల కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు గారడి చేస్తున్నారు తప్పా నిజం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారో ప్రజలకు అర్థమవుతున్నదని, కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు వినే పరిస్థితిలో జనం లేరన్నారు. కరోనా వంటి పరిస్థితిలోనూ కేసీఆర్ సంక్షేమ పథకాలను అందించారన్నారు. గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇస్తానన్న కొత్త పింఛన్లు అమలుకు నోచుకోలేదని, కల్యాణలక్ష్మి తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. వడ్లకు బోనస్ అని బోగస్ మాటలు చెప్పారని, సీఎం ఓ మాట మాట్లాడితే, మంత్రులు మరో మాట మాట్లాడుతూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, సీఎం అయితే అభివృద్ధి చెందుతున్న నమ్మకంతో ఓట్లు వేసిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. మండలానికో పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రావు యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్ల మహిపాల్, నారాయణరెడ్డి, కోట్ల యాదగిరి, బాబర్, మహేందర్‌రెడ్డి, ఫకీరప్ప, దేశ్యానాయక్, రవి గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆమనగల్లులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

ఆమనగల్లు, జనవరి 29 : ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని ప్రముఖ న్యాయవాది లక్ష్మణశర్మ డిమాండ్ చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసిస్తూ ఆమనగల్లు బార్ అసోసియేషన్, గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ కల్వకుర్తి, తెలంగాణ జేఏసీ ఆమనగల్లు సంయుక్తంగా మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పీడిత, తాడిత ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిన గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేంద్రంలోని బీజేపీ మతాల పేరిట, కులాల పేరిట రాజకీయాలు చేస్తూ దేశాన్ని అధోగతిపాలు చేస్తున్నదని ఆరోపించారు. దేశంలో ప్రశ్నించే నాయకులపై కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని వారు దుయ్యబట్టారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రమంతటా గద్దర్ అభిమానులు నిరసనలు చేపడుతారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేసన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్, నాయకులు ఎగిరిశెట్టి సత్యం, ఇబ్రాయిల్, శివలింగం, సుధాకార్, రజితక్క, నర్సింహ, భిక్షపతి, గోపాల్, శేఖర్, శ్రీను, శేఖర్, యాదయ్య, శంకర్, పుల్లయ్య, యాదయ్య, సురేశ్, శ్రీను పాల్గొన్నారు.

### అప్పుచేసి ఎరువులు కొనుగోలు చేశా..



ఎవుసం కోసం మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. రూ.లక్ష అప్పు చేసి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేశా. బీఆర్ఎస్ హయాంలో సమయానికి పెట్టుబడి సాయం అందేది. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయిండు. వీలైనంత త్వరగా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి.

– నీలి శంకర్, మర్పల్లి కలాన్, మర్పల్లి మండలం

### రైతులను కాంగ్రెస్ మోసం చేసింది..



ఎన్నికలకు ముందు ఏడాదికి ఎకరాకు రూ.15 అందజేస్తామని చెప్పి. ప్రస్తుతం రూ.12వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా నయా పైసా ఇవ్వలేదు. నేడు రేపు అంటూ దాటవేస్తున్నది. ఇప్పటికైనా అదునుకు పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకుంటే మంచిది. లేదంటే రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు.

– నర్సింహారెడ్డి, మోమిన్‌ఖుర్దు, ధారూరు మండలం



**1.88 లక్షల మంది రైతులకుగాను, కేవలం 8 వేల మందికే పెట్టుబడి సాయం**

**జిల్లావ్యాప్తంగా 5.80 లక్షల ఎకరాలకుగాను 80 వేల ఎకరాలకే అందిన భరోసా**

**మండలానికి ఒక గ్రామానికి పెట్టుబడి సాయం అందజేత**

**బీఆర్ఎస్ హయాంలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం**



*రైతు భరోసాపై జిల్లా రైతాంగం భగ్గుమంటున్నది. ఎన్నికలకు ముందు రూ. 15 వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామంటూ ఇచ్చిన మాట తప్పిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి రైతుల బ్యాంకు ఖాతాల్లో టింగ్ టింగ్ మంటూ రైతు భరోసా మెసేజ్ వస్తుందని ప్రగల్భాలు పలికి.. తీరా 10 శాతం మందికి కూడా పెట్టుబడి సాయాన్ని అందించలేకపోయిందని జిల్లావాసులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఆయా మండలాల్లో తక్కువ జనాభా ఉన్న గ్రామాలను ఎంపిక చేసి పెట్టుబడి సాయాన్ని అందజేసింది. అర్హులు దాదాపు 2 లక్షల మంది ఉండగా, ఇచ్చింది కేవలం సుమారు 8 వేల మందికేనని జిల్లా అంతటా అసంతృప్తి వ్యక్తమవుతున్నది. అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కూడా మండలంలో ఒక్కగ్రామానికే పెట్టుబడి సాయాన్ని అందించడం ఏమిటని రేవంత్ సర్కార్‌ను సబ్బండ వర్ణాలు ప్రశ్నిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 5.80 లక్షల ఎకరాలకుగాను 80 వేల ఎకరాలకు మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా అందించింది. పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సొంత ఊరు శివారెడ్డిపల్లిని ఎంపిక చేయడంపై నియోజకవర్గ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు అదునుకు పెట్టుబడి సాయాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేశారని జిల్లావాసులు గుర్తుచేసుకుంటున్నారు.*

*- వికారాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ)*

# ఒక్క ఊరికేనా..?

## రైతు భరోసాపై భగ్గుమంటున్న జిల్లా రైతాంగం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుంట భూమి మొదలుకొని అర్హులైన ప్రతి రైతుకు రైతు బంధు సాయాన్ని అందజేశారు. సీజన్ ప్రారంభానికి ముందే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసేందుకుగాను రైతుబంధు డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. జిల్లావ్యాప్తంగా 12.35 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటిలో అర్హులైన రైతులకు సంబంధించిన 6.20 లక్షల ఎకరాలకుపైగా భూములకు రూ.300 కోట్లకు పైగా పెట్టుబడి సాయాన్ని అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దాదాపు 30 వేల ఎకరాలను తగ్గించి 5.80 లక్షల ఎకరాలకు సాయాన్ని అందించాలని నిర్ణయించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద రూ.2926 కోట్ల సాయాన్ని అందజేసింది. 2018 వానకాలం సీజన్‌లో 1,94,833 మంది రైతులకుగాను రూ.221 కోట్లు, యాసంగిలో 1,75,989 మంది రైతులకు రూ.206 కోట్లు, 2019 వానకాలం సీజన్‌లో 1,78,998 మంది రైతులకుగాను రూ.255 కోట్లు, యాసంగి సీజన్‌లో 1,71,824 మంది రైతులకుగాను రూ.194 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించింది. 2020 వానకాలం సీజన్‌లో 2,113,341 మంది రైతులకు రూ.297 కోట్లు, యాసంగిలో 2,19,264 మంది రైతులకు రూ.301 కోట్ల పెట్టుబడి, 2021 వానకాలం సీజన్‌లో 2,25,438 మంది రైతులకుగాను రూ.300 కోట్లు, యాసంగి సీజన్‌లో 2,24,928 మందికిగాను రూ.241 కోట్ల పెట్టుబడి సాయాన్ని గత ప్రభుత్వం అందజేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో వానకాలం సీజన్‌లో 2,47,707 మంది రైతులకుగాను రూ.305 కోట్ల రైతుబంధు సాయం, యాసంగిలో 2,43,447 మందికిగాను రూ.299 కోట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరంలో వానకాలం సీజన్‌లో 2,62,065 మంది రైతులకు రూ.307.47 కోట్ల పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.5 వేల చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం జమ చేసింది.

### మళ్లీ అప్పులపాలవుతున్నం..



ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఏ ఒక్క పథకాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నది. సర్కారు ఏర్పడి 14 నెలల తర్వాత మండలానికి ఒక ఊరికే రైతు భరోసా ఇవ్వడం బాధాకరం. పెట్టుబడి కోసం మళ్లీ అప్పులు చేయాల్సి వస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో అదునుకు రైతు బంధు డబ్బులు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– బీ రాజు కెరెళ్లి, ధారూరు మండలం

### బీఆర్ఎస్ హయాంలో అదునుకు సాయమందేది..



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అదునుకు పెట్టుబడి సాయం అందేది. నాకు రెండు ఎకరాల పొలం ఉన్నది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నా. ఎరువులు, విత్తనాల కోసం బాకీ చేయాల్సి వచ్చింది. వానకాలంలో పంట దెబ్బతిన్నది. రైతు భరోసా రాక, పంట చేతికి అందక నానా ఇబ్బందులు ఎదుర్కొన్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రైతు భరోసా అందజేయాలి.

–ఎన్.యాదిరెడ్డి, రావులపల్లి, మర్పల్లి మండలం

**కేవలం 20 గ్రామాలకే రైతు భరోసా..**

| మండలం | గ్రామం | రైతులు | రైతు భరోసా సాయం |
|---|---|---|---|
| బంట్వారం | నాగవరం | 340 | రూ.46.98 లక్షలు |
| బషీరాబాద్ | ఖాసీంపూర్ | 419 | రూ.61.47 లక్షలు |
| బొంరాసుపేట | నాగిరెడ్డిపల్లి | 305 | రూ.35.41 లక్షలు |
| చౌడాపూర్ | మక్తవెంకటాపూర్ | 419 | రూ.42.30 లక్షలు |
| ధారూరు | అవుసుపల్లి | 192 | రూ.16.16 లక్షలు |
| దోమ | శివారెడ్డిపల్లి | 376 | రూ.56.69 లక్షలు |
| దౌల్తాబాద్ | నందారం | 374 | రూ.48.03 లక్షలు |
| దుద్యాల | సంగాయిపల్లి | 824 | రూ.1.01 కోట్లు |
| కొడంగల్ | అన్నారం | 833 | రూ.1.37 కోట్లు |
| కోట్‌పల్లి | కంకణాలపల్లి | 322 | రూ.42.02 లక్షలు |
| కులకచర్ల | అనంతసాగర్ | 246 | రూ.25.61 లక్షలు |
| మర్పల్లి | గుండ్లమర్పల్లి | 363 | రూ.46.90 లక్షలు |
| మోమిన్‌పేట | బాల్‌రెడ్డిగూడ | 472 | రూ.53.18 లక్షలు |
| నవాబుపేట | దాతాపూర్ | 269 | రూ.29.81 లక్షలు |
| పరిగి | సుల్తాన్‌పూర్ | 497 | రూ.61.95 లక్షలు |
| పెద్దేముల్ | మంబాపూర్ | 570 | రూ.65.34 లక్షలు |
| పూడూరు | ఎన్కెపల్లి | 430 | రూ.70.43 లక్షలు |
| తాండూరు | చంగీష్‌పూర్ | 280 | రూ.36.40 లక్షలు |
| వికారాబాద్ | పెండ్లిమడుగు | 513 | రూ.50.08 లక్షలు |
| యాలాల | తిమ్మాయిపల్లి | 565 | రూ.90.04 లక్షలు |
| మొత్తం | 20 | 8609 | రూ.11.17 కోట్లు |



రంగులు లేక పాతబడిన ప్రభుత్వ పాఠశాల భవనం

# అటకెక్కిన ఆదర్శం

## పాఠశాలల్లో ఆగిపోయిన ఆధునీకీకరణ పనులు

**నిధులున్నా పరిపాలన అనుమతులు లేవు**

**ఆరునెలలుగా పాఠశాలల్లోనే రంగు డబ్బాలు**

**జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం అటకెక్కింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మన ఊరు - మన బడి'ని అమ్మ ఆదర్శ పాఠశాలలుగా పేరు మార్చి ఆధునీకీకరణ కోసం నిధులు విడుదల చేశారు. పాఠశాలలకు కమిటీలనూ ఏర్పాటు చేయడంతోపాటు కమిటీల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించగా, అభివృద్ధిపై దృష్టి సారించడంలేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఎంపికైన 700 పాఠశాలలకు జనవరి నాటికి రంగులు వేయడం పూర్తి చేయాల్సి ఉన్నది. అధికారికంగా పరిపాలన అనుమతులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ రంగు డబ్బాలు తీసుకొచ్చి పాఠశాలల్లో మూలన పడేశారు. అంతేకాకుండా పాఠశాలల్లో చేసిన ఇతర పనులకూ బిల్లులు రాలేదని ఏజెన్సీలు రంగులు వేయడం మానేశారు.**

**- రంగారెడ్డి, జనవరి 28 (నమస్తే తెలంగాణ)**

### పాఠశాలలకు రూ.23 కోట్ల, తొమ్మిది లక్షలు

పాఠశాలల భవనాలకు రంగులు వేయడం, బెంచీల కోసం, వంట గదుల నిర్మాణం, విద్యార్థులకు తాగునీరు, వంటి మౌలిక వసతులు కల్పించేందుకు రూ.23 కోట్ల, తొమ్మిది లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్ని పాఠశాలల్లో మాత్రమే పనులు చేపట్టగా, వాటికీ బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. బెంచీలు లేకపోవడం వల్ల విద్యార్థులు నేలపై కూర్చోవాల్సి వస్తున్నది.

### తల్లిదండ్రులకే ఆధునీకీకరణ బాధ్యత ఇవ్వాలి



అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధునీకీకరణ బాధత్యలను విద్యార్థుల తల్లిదండ్రులకే అప్పజెప్పాలి. మహిళా సంఘాలకు అప్పజెప్పితే వారు పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల నిర్వహణపై అశ్రద్ధ వహించడం సరి కాదు.

– నిట్టు జగదీశ్వర్, విద్యార్థి సంఘం నాయకుడు

### వసతులు లేక ఇబ్బందులు..

ఆయా పాఠశాలలకు మరమ్మతు చేయించకపోవడంతో సరైన వసతులు లేక అమ్మ ఆదర్శ పాఠశాలల లక్ష్యం నీరుగారుతున్నది. ఆధునీకీకరణకు రూ.23 కోట్ల, తొమ్మిది లక్షలను మంజూరు చేసి మహిళా సంఘాలకు బాధ్యతను అప్పగించింది. గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీల్లో ఉండడం వల్ల పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించేవారు. పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా పాఠశాలలను పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రంగులిచ్చి మళ్లీ తీసుకెళ్లారు..

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పాత ఇబ్రహీంపట్నంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో రంగులు వేయడానికి ఆరు మాసాల కింద రంగు డబ్బాలను తీసుకొచ్చారు. కానీ, పరిపాలన అనుమతులు లేవని రంగులను ఏజెన్సీ వారు తిరిగి తీసుకెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

